


# టీఆర్ఎస్ ఆఫీసులో మేడే వేడుకలు

■ పార్టీ, కార్మిక జెండాలు ఎగురవేసిన అధ్యక్షురాలు కవిత



**ప్రజానావ, హైదరాబాద్ :** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రాష్ట్ర సేన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మే డే జెండాతో పాటు కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్మికులు, కర్షకులకు 'మే' డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక అమరవీరులకు నివాళులు అర్పించారు. మే డే వేడుకల్లో ఆటో యూనియన్ నాయకులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ జాగృతి నాయకులు పాల్గొన్నారు.



## పేదల కల సాకారానికే ప్రజా ప్రభుత్వం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జె టోనీ

అర్హులందరికీ రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ

**ప్రజానావ, సిరిసిల్ల:** రాష్ట్రంలోని నిరుపేదల స్వంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జె టోనీ పేర్కొన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు అందజేస్తామని వెల్లడించారు. నిరుపేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని లబ్ధిదారులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి తరపున చిరు కానుకగా నూతన పట్టు వస్త్రాలను నాయకులు అందజేశారు. తమకు సొంతింటి కల నెరవేరేలా కృషి చేసినందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డిలకు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న కేంద్రం

సిరిసిల్ల కార్మిక భవన్ మేడే దినోత్సవంలో

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి

**ప్రజానావ, సిరిసిల్ల :** పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్నదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్ లు ఆరోపించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటీయూసీ కార్మిక భవన్ శుభాష్ నగర్ లో 140 వ మే డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్ మాట్లాడుతూ మన దేశంలో 1920 లో ఏఐటీయూసీ ఆవిర్భావం తరువాత బ్రిటిష్ వారితో సైతం కొట్లాడి కార్మికుల హక్కులు సాధించుకుంటే ఈ రోజున కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల నుండి 29 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా మార్చి దేశ కార్మికులను బానిసలుగా చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల చంద్రమౌళి, కేవీ అనసూర్య, దుండ్రపెల్లి రవీందర్, పందుల మల్లేశం, ఈసరి దేవయ్య, తోడేటి పవిత్ర, వడ్డెపెల్లి లక్ష్మన్, సుంకణపెల్లి శాంత, గాజుల రాధ, సోమ నాగరాజు, ఎనగందుల రాజు తదితరులు పాల్గొన్నారు.




## పసుపును ఆహార పంటగా గుర్తించాలి

క్వింటాలుకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలి

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజానావ, హైదరాబాద్ :** పసుపును ఆహార పంటగా గుర్తించి క్వింటాల్ కు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిజామాబాద్ కు చేరువగా మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్ లో క్వింటాల్ పసుపునకు రూ.17 వేల ధర పలుకుతుందని తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ లో వ్యాపారులు సిండికేట్ గా మారి రూ.13 వేలకు మించి ధర పెట్టడం లేదని, దీంతో పసుపు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పైసెస్ బోర్డు ఉత్సవ విగ్రహంలా మారిందని.. స్పైసెస్ బోర్డును బలోపేతం చేసి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లోని పసుపు రైతులకు అండగా నిలవాలని కోరారు. వెంటనే ఆహార పంటల జాబితాలో పసుపును చేర్చి కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. నిజామాబాద్ మార్కెట్ లో ఇంకా లక్ష క్వింటాళ్లకు పైగా పత్తి కొనుగోలు చేయాల్సి ఉందని, ఆ రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు. ఈ– నామ్ 2.0 ప్రారంభ సమయంలో నిజామాబాద్ మార్కెట్ ను చేర్చకపోవడంతో పసుపు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. తర్వాత ఇ – నామ్ 2.0లో నిజామాబాద్ మార్కెట్ ను చేర్చినా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పసుపు పంటకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతోనే గడిచిన ఏడేళ్లుగా నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో పసుపు పంట సాగు విస్తీర్ణ గణనీయంగా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పసుపు రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.

## జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**ప్రజానావ, సిరిసిల్ల :** శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని "పోలీస్ యాక్ట్ 1861" ప్రకారం నెల రోజులు (మే 1వ తేది నుండి 31 తేదీ వరకు) జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనల కు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఈ విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## కార్మికులే మున్సిపాలిటీకి వెన్నుముక

పురపాలక కార్మికులకు ఉచిత వైద్య శిబిరంలో కమిషనర్ ఖదీర్ పాషా



**ప్రజానావ, సిరిసిల్ల :** పట్టణ పరిశుభ్రతలో అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులే పురపాలక సంఘానికి నిజమైన వెన్నుముక అని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సిరిసిల్ల పురపాలక సంఘం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యంపై మున్సిపాలిటీకి ప్రత్యేక శ్రద్ధ ఉందని, అందుకే ప్రతి నెల లేదా నిర్ణీత సమయాల్లో ఇలాంటి వైద్య శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి కార్మికుడు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమను, తమ కుటుంబాన్ని ఆరోగ్యంగా కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ దార్ల సందీప్, రడం శ్రీనివాస్, ఉమర్, మున్సిపల్ సిబ్బంది, జిల్లా వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు. ఏ శిబిరంలో వైద్యులు కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు, మందులను అందజేశారు.

## 8 గంటల పని దినాన్ని కాపాడుకుందాం

- బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్స్ రద్దుకు పోరాడుదాం
- పవర్‌లూమ్‌వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు
- ఘనంగా మేడే వేడుకలు.. సీఐటీయూ జెండా ఆవిష్కరణ




**ప్రజానావ, సిరిసిల్ల :** నేడు కేంద్రంలో ఉన్న బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను 29 చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలముగా వారికీ లాభాలు కోసం 4 లేబర్ కోడ్స్ తెచ్చిందని పవర్ లూమ్‌వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ లు ఆరోపించారు. శుక్రవారం మే డే వేడుకల సందర్భంగా సీఐటీయు ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో బీవై నగర్, నెహ్రునగర్, గణేష్ నగర్, చంద్రంపేట, మున్సిపల్, హాస్పిటల్, రైతుబజార్, శాంతినగర్ పెద్దూర్‌లో సిఐటి యు జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి మున్సిపల్ లేబర్ అడ్డ వద్ద బహి రంగ సభ నిర్వహించారు. ఈ సభ ముఖ్యఅతిథిగా పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు. మూషం రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ లు హాజరై మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు సంఘటితంగా పోరాడే హక్కు, సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, కార్మికుల తొలగింపులు, ఉద్యోగం భద్రత ఇంకా అనేక కార్మికులు సౌకర్యాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. బీజేపీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అన్నల్దాస్ గణేష్, సూరం పద్మ, రమేష్ చంద్ర, మిట్టపల్లి రాజమల్లు, రాపల్లి రమేష్, ఎర్రవల్లి నాగరాజు, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, ఎలిగేటి శ్రీనివాస్, ఒగ్గు గణేష్, శ్రీరాం సదానందం, ఉడుత రవి, కుమ్మరకుంట కిషన్,దాసరి రూప, ఆడెపు రజిత, గట్ల సప్న, బెజిగం సురేష్, గుండు రమేష్, కోలా శ్రీనివాస్, కాసారపు శంకర్, మచ్చ వేణు, గడ్డం రాజశేఖర్, బింగి సంపత్, స్వర్గం శేఖర్, బాస శ్రీధర్, సురేష్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

## డోంబివలిలో కలకలం

విద్యుత్ బాక్స్‌లో చేయి పెట్టుకుని యువకుడి ఆత్మహత్య

**ప్రజానావ, ముంబై:** డోంబివలిలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్యతో కలహాల కారణంగా పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన సమాధాన్ కాంబ్లే (36) విద్యుత్ పంపిణీ డీపీ బాక్స్‌లో చేయి పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్ర విద్యుత్ షాక్‌తో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న విష్ణు నగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. కుటుంబ కలహాలే కారణమని ప్రాథమికంగా భావిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

